క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సామూహిక గాయత్రీ జపం



సామూహిక గాయత్రీ జపం కార్యక్రమానికి హాజరైన శ్రీరామచంద్రమూర్తి

కర్నూలు (న్యూటౌన్): నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం శతకోటి గాయత్రీ జప బృందం హరిహర క్షేత్రంలో సామూహిక గాయత్రీ జపం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన సంధ్యావందనం అభ్యాసన శిక్షణా సమితి అధ్యక్షుడు గురువు కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి హాజరై వేదవిద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ శర్మ, కర్నూలు శతకోటి గాయత్రీ జప కోఆర్డినేటర్ ఫణిరాజ్, బ్రాహ్మణ సంఘం నగర కార్యదర్శి రాజశేఖర్‌రావు, ఏపీ బ్రాహ్మణ సేవ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ లావణ్య లక్ష్మి

కల్లూరు: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పెద్దటేకూరు గ్రామంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పశుసంవర్ధ శాఖ నోడల్ అధికారి, సంయుక్త సంచాకులు డాక్టర్ లావణ్య లక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలుగు నెలలు దాటిన పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలన్నారు. పశువులకు చెవి పోగు వేయటం ద్వారా పాడిరైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.రామచంద్రయ్య, కర్నూలు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ దుర్గ ప్రసన్న బాబు, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు, కల్లూరు ఏడీ పార్థసారథి, ఏడీ ప్రమీలరాణి, చిన్నటేకూరు పశువైద్యులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

గూడూరు: పట్టణంలో తిమ్మగురుడు స్వామి మైదానంలో శనివారం రాత్రి శివ పార్వతుల కల్యాణం శ్రీశైల దేవస్థానం, స్థానిక శివ భక్తుల ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. అంతకుముందు పట్టణంలో ఆది దంపతుల శోభా యాత్రను నిర్వహించారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

కోడుమూరు రూరల్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చదువు, ఆటల్లో పోటీతత్వం అలవర్చుకోవాలని అమడగుంట్ల హైస్కూల్ హెచ్‌ఎం అనంతయ్య సూచించారు. శనివారం పాఠశాలలో లింగనిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం, ఆడ పిల్లల సంరక్షణపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమణికుమార్, చంద్రమోహన్, రవికుమార్, మురళీకృష్ణ, జగన్మోహన్ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ దృశ్యం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని రచ్చకట్ట నుంచి గ్యాస్ కార్యాలయం సీసీ రోడ్డు, డ్రైనేజీ కాల్వ ఏర్పాటు పనులను శనివారం ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం వేల సంఖ్యలో రాకపోకలకు సాగించే ప్రధాన రోడ్డు పూర్తిగా దెబ్బతినిందన్నారు. గడపగపడకు-మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించారన్నారు. రూ. 10లక్షల వ్యయంతో సీసీ రోడ్డు వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొజ్జన్న, ఆటోమాబు, టైలర్‌బాషా, మహేష్ పాల్గొన్నారు.



నాడు శిథిలావస్థలో పెసరవాయి యూపీ స్కూల్



నేడు సరికొత్తగా రూపుదిద్దుకున్న పాఠశాల





విద్యార్థులను ఆకట్టుకునేలా బూజునూరు పాఠశాల తరగతి గది, గని పాఠశాలలో కొత్తగా నిర్మించిన ఆధునిక మరుగుదొడ్డి

కార్పొరేట్‌కు దీటుగా..

నాడు-నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు

నాలుగేళ్ల క్రితం వరకు ప్రభుత్వ పాఠశాలలు అసౌకర్యాలకు నిలయం. కనీస వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు కూడా ఉండేవి కాదు. అలాంటి పాఠశాలలు వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సరికొత్తగా తయారయ్యాయి. సౌకర్యాలు, విద్యాబోధనలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపుదిద్దుకున్నాయి.

- అభివృద్ధి పథంలో సర్కార్ స్కూళ్లు
- మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య
- పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- హర్షం వ్యక్తం చేస్తున్న పిల్లల తల్లిదండ్రులు



పిల్లలతో కళకళలాడుతున్న ఒండుట్ల పాఠశాల తరగతి గది



గడివేముల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఇందులో భాగంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను సకల సౌకర్యాలతో సుందరంగా తీర్చిదిద్దారు. గత పాలకులు సర్కారు స్కూళ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో పిల్లలను సర్కారు బడికి పంపేందుకు తల్లిదండ్రులు అనాసక్తి చూపేవారు. 2019లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్కూళ్లలో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టింది. అధ్వానంగా ఉన్న పాఠశాలలను నాడు- నేడు మొదటి విడత కార్యక్రమం ద్వారా సుందరంగా తీర్చిదిద్దింది. నియోజకవర్గంలో ఒక్క గడివేముల మండలంలోనే రూ.291.34 లక్షలతో 13 పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసింది.

రెండో విడతలో రూ.2.67 కోట్లు మంజూరు

మండలంలోని మొత్తం 38 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలు ఉన్నాయి. వీటిల్లో 13 పాఠశాలల్లో రూ. 2.91కోట్లతో మొదటి విడత నాడు-నేడు కింద అభివృద్ధి పనులు జరిగాయి. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఆయా పాఠశాలలు రూపురేఖలు మారాయి. ఇప్పుడు రెండో విడత నాడు- నేడు కింద అభివృద్ధి పనులు చేపట్టేందుకు గని, గడిగరేవుల, కరిమద్దెలలోని జిల్లా పరిషత్ హైస్కూళ్లను ఎంపిక చేశారు. ఈ విడతలో సౌకర్యాల కల్పనతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. గని హైస్కూల్‌లో ఐదు నూతన తరగతుల నిర్మాణానికి గాను రూ.60 లక్షలు, వసతులకు రూ.81 లక్షలు మంజూరైంది. గడిగరేవుల హైస్కూల్‌కు రూ.63 లక్షలు, కరిమద్దెల హైస్కూల్‌కు రూ.63 లక్షలు మంజూరై పనులు దాదాపు పూర్తి కావచ్చాయి.

రంగురంగుల బొమ్మలతో పాఠశాల గదులు

నాడు-నేడు పనుల క్రింద విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా తరగతి గదుల్లో రంగుల రంగుల బొమ్మలు వేయించారు. అర్థమయ్యేభాషలోనే వాటి పేర్లను రాశారు. ప్రతి గదిలో నాలుగేసి ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్‌లు ఉండేలా ఏర్పాట్లు చేశారు. ప్రాథమిక విద్యలోనే ఇంగిష్ భాషపై విద్యార్థులు పట్టు సాధించేలా తగిన బోధనోపకరణ సామగ్రి ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పాఠశాలలో ఇంగ్లిష్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి 4కే ఆండ్రాయిడ్ స్మార్ట్ టీవీలు కూడా అమర్చుతున్నారు.

పాఠశాలల వారీగా నాడు-నేడు మొదటి విడతలో మంజూరైన నిధుల వివరాలు

పాఠశాల పేరు	మంజూరైనా నిధులు రూ.లక్షల్లో
గడివేముల (ఎంపీపీ)పాఠశాల	21.14
గడివేముల ఏపీ మోడల్ పాఠశాల	43.70
కస్తూరిబా పాఠశాల	34.49
బూజునూరు (ఎంపీపీ)పాఠశాల	11.64
గని (ఎంపీపీ)పాఠశాల	22.34
మంచాలకట్ట (ఎంపీపీ)పాఠశాల	22.35
ఒండుట్ల (ఎంపీపీ)పాఠశాల	17.28
కొర్రపోలూరు (ఎంపీపీ)పాఠశాల	14.38
బిలకలగూడూరు యపీ స్కూల్	18.37
కరిమద్దెల (ఎంపీపీ)పాఠశాల	22.98
గడిగరేవుల (ఎంపీపీ)పాఠశాల	22.57
కొరటమద్ది (ఎంపీపీ)పాఠశాల	22.48
పెసరవాయి (ఎంపీయూపీ)పాఠశాల	17.62
మొత్తం	291.34



కార్పొరేట్ పాఠశాలను తలపిస్తున్న బూజునూరు ఎంపీపీ ప్రభుత్వ స్కూల్

మా ఊరి బడే బాగుంది



నాకు ఇద్దరు కుమారులు. వారిని బాగా చదివించుకోవాలని మొదట గడివేములలోని ప్రైవేట్ స్కూల్‌లో చేర్పించాను. డబ్బులు ఖర్చు అయ్యాయి తప్ప చదువు రాలేదు. ఇప్పుడు మా ఊరి బడిలోనే చదువుతున్నారు. టీచర్లు బాగా చదు వు చెబుతున్నారు. స్కూలులో సౌకర్యాలు బాగున్నాయి. మాకు పైసా ఖర్చులేకుండా పిల్ల లకు ప్రభుత్వమే పుస్తకాలు ఇస్తూ చదివిస్తుంది.

–మర్రి గిరిజ, బూజునూరు గ్రామం

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు



సాంకేతిక విద్యను అందిపుచ్చుకుని మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యాంశాల బోధనకు స్మార్ట్ టీవీలు ఎంతో ఉపయోగపడతాయి. ఇంగ్లిష్ భాషను వినడం,చూడటం ద్వారా పట్టు సాధించవచ్చు. నేను ప్రభుత్వ పాఠశాలలో ఇన్ని సదుపాయాలు ఎప్పుడూ చూడలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థికి కావాల్సిన అని సదుపాయాలు కల్పించారు.

–రవి,హెచ్‌ఎం, ఎంపీపీస్కూల్,బూజునూరు

రైతుల సంక్షేమమే ధ్యేయం



రైతులకు మోటర్ పంపుసెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే స్వగృహంలో వైఎస్సార్ జలకళ కింద బోర్లు వేసిన ఓర్వకల్లు మండలం ఎన్.కొంతలపాడు, గుట్టపాడు గ్రామాలకు చెందిన రైతులకు మోటర్ పంపుసెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన సన్న, చిన్నకారు రైతులకు వైఎస్సార్ జలకళ కింద బోర్లు మంజూరు చేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకోలేదని తమ ప్రభుత్వం ఉదయమే రైతులకు వ్యవసాయ విద్యుత్ అందిస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు అందుబాటులో పెట్టామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మన్న, టీసీ గౌస్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సూర్యనారాయణరెడ్డి, ఎన్.కొంతలపాడు, గుట్టపాడు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాబు మాయమాటలు నమ్మొద్దు

- రానున్న ఎన్నికలు పెత్తందారులు, పేదల మధ్యే
- కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్
- నందనపల్లిలో పండుగలా సాగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం



నందనపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: అధికారం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు మాయమాటలు చెబుతారని, నమ్మి మోసపోవద్దని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ ప్రజలకు సూచించారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని నందనపల్లెలో పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. పండుగలా సాగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు మండల పరిషత్ అధ్యక్షురాలు డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్ పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల్లోని పేదలకు వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గతంలో ఈ పథకాలు పేదలకు అందేవి కాదన్నారు. రోజుల తరబడి రాజకీయ నాయకులు, వారి ఇళ్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం తాము గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ఇంటి వద్దకే ప్రభుత్వ ఫలాలను తీసుకొస్తున్నామన్నారు. అవినీతికి తావు లేకుండా అర్హులందరికీ వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. దీనిని చూసి పెత్తందారులు తట్టుకోలేకపోతున్నారన్నారు. రానున్న ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతాయన్నారు. పేదల తరఫున నిలబడిన జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.

జగనన్న అంటే నమ్మకం

తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడిది ప్రజలను మోసం చేసే నైజం అని ఎమ్మెల్యే విమర్శించారు. ఇచ్చిన మాట కోసం ఎంత కష్టమైనా అండగా నిలబడే గుణం తమ అధినేత వైఎస్ జగన్‌ది అని చెప్పారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసినందుకే ప్రజలకు జగనన్నపై ఎనలేని నమ్మకం అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజాంఖాన్, గ్రామ సర్పంచ్ కె.మాధురి, స్థానిక నాయకులు వెంకటేశ్వర్లు, జి.శింగవరం ఆదాము, ఆర్.కొంతలపాడు మద్దిలేటి,బి.తాండ్రపాడు మోహన్‌బాబు, ఉల్చాల సాగర్, సంపత్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా పోటీలకు ఆర్‌యూ జట్టు

కర్నూలు (టౌన్): ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు చెన్నై రాష్ట్రంలోని ఎస్ఆర్‌ఎం సైన్స్, టెక్నాలజీ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా అంతర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో రాయలసీమ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ జట్టు పాల్గొంటున్నట్లు ఆ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ రెహమాన్ తెలిపారు. శనివారం బ్యాడ్మింటన్ క్రీడాకారులు ప్రణవి, అకాంక్ష, జాహ్నవి, సింధు, ఫరీహాశరీన్, కోచ్ హేమంత్‌రెడ్డిని వీసీ అభినందించి మాట్లాడారు. ఈనెల 2 నుంచి 5 వ తేదీ వరకు విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీలో నిర్వహించిన సౌత్‌జోన్ అంతర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ టోర్నమెంటులో రాయలసీమ జట్టు మూడో స్థానంలో నిలిచి ఆల్ ఇండియా పోటీలకు అర్హత సాధించిందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ సీవీ క్రిష్ణరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుందరానందాపుచ్ఛ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు ఉస్మానియా విద్యార్థి

కర్నూలు (టౌన్): ఈనెల 7 నుంచి 16 వ తేదీ వరకు చెన్నై రాష్ట్రంలోని హిందూస్థాని యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఉస్మానియా కళాశాలకు చెందిన మూడవ సంవత్సరం విద్యార్థి పి. సాయితేజ ఎంపికయ్యాడు. శనివారం స్థానిక ఆ కళాశాలలో ప్రిన్సిపాల్ సయ్యద్ సమీయుద్దీన్ ముజ్జమిల్ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రఫీక్ అహమ్మద్ పాల్గొన్నారు.

ఆదర్శం జగనన్న పాలన

గడివేముల: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని వైఎస్సార్‌సీపీ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మంచాలకట్ట సచివాలయంలో శనివారం పెంచిన, కొత్తగా మంజూరైన పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తాన్ని రూ. 3 వేలకు పెంచి అవ్వాతాతలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ లింగేశ్వరి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటరు అర్జీలను 9లోపు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లోని ఫారం 6,7,8 ఓటరు అర్జీలను ఈనెల 9వ తేదీలోపు పరిష్కరించాలని పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఆమె మాట్లాడు తూ..ఫొటో, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీలను త్వరగా పరిష్కరించాలన్నారు. మార్పులు, చేర్పులను సరైన ప్రణాళికలతో చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యంతరాలను పరిశీలించేందుకు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రమేష్‌బాబు, వైఎస్ఆర్‌సీపీ నుంచి అక్కిమి అనుమంతరెడ్డి, కాంగ్రెస్ నుంచి శ్రీనివాస యాదవ్, బీజేపీ నుంచి రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ నుంచి యశ్వంత్‌రెడ్డి, బీఎస్పీ నుంచి చిరంజీవి, సీపీఐ నుంచి శ్రీనివాసరావు, సీపీఎం నుంచి రామకృష్ణ పాల్గొన్నారు.

8లోగా పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి



వర్కూరులో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: పింఛన్ల పంపిణీని ఈనెల 8లోపు పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. శనివారం మండలంలోని కోడుమూరు, వర్కూరు గ్రామాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని పరిశీలించారు. కొత్త పింఛన్లు లబ్ధిదారులకు తప్పకుండా అందజేయాలన్నారు. అంతకు ముందు కోడుమూరు గ్రామ సచివాలయం-1, వర్కూరు గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. కార్యాలయ వేళల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



వృద్ధుడు గొర్ల మిన్నెల్లకు పింఛన్ అందజేస్తున్న వలంటరీ రసూల్

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన వృద్ధుడు గొర్ల మిన్నెల్ల ఊపిరితిత్తుల సమస్యతో వారం రోజులుగా కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైఎస్సార్ పింఛన్ కానుకను తీసుకునేందుకు కూడా రాలేని పరిస్థితిలో వృద్ధుడు ఉన్నాడన్న విషయం తెలుసుకున్న వలంటరీ రసూల్ కర్నూలులోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మిన్నెల్లకు వృద్ధాప్య పింఛన్ అందజేశారు.

10 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు



క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓర్వకల్లు: ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా ఈ నెల 10వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకు సచివాలయ పరిధిలో నిర్వహించిన క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయన్నారు. రెండో దశ అయిన మండల స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన వారికి ఖోఖో, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాంశంలో పోటీలు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే క్రీడాకారులకు అవసరమైన క్రీడా దుస్తులను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. ప్రస్తుత్వం సరఫరా చేసిన 4330 టీ షర్టులు, 4330 టోపీలను ఆయా సచివాలయాల పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశామన్నారు.

హుసేనాపురంలో క్రీడాదుస్తుల పంపిణీ

మండలంలోని హుసేనాపురం గ్రామంలోని సచివాలయం-1,2 పరిధిలోని క్రీడాకారులకు ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా దుస్తులను శనివారం కాల్వబుగ్గ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ చంద్ర పెద్దస్వామి చేతుల మీదుగా పంపిణీ చేశారు. రెండు సచివాలయాల పరిధిలో దాదాపు 500 మంది క్రీడాకారులకు టోపీ, టీషర్టులతో పాటు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జీకే వెంగన్న, గోపా రామమోహన్‌రెడ్డి, కొమ్ము లక్ష్మన్న, రామేశ్వరరెడ్డి, న్యామతుల్ల, గోపా రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సచివాలయ కన్వీనర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



లోక శ్రేయస్సును కాంక్షిస్తూ..

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శనివారం కుటుంబసభ్యులతో కలిసి తన నివాసంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

కోనా వేంకటేశ్వరుడికి పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వెంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. శనివారం దశమితో పాటు స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు. స్థానిక గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పులకుర్తి, పోలకల్లు, ఇనగండ్ల గ్రామాల నుంచి భారీగా తరలివచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల్లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: వాతావరణంలో మార్పులతో కలిగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ రామగిడ్డయ్య వైద్య సిబ్బందికి ఆదేశించారు. శనివారం కల్లూరు మండలం పర్ల గ్రామంలోని సచివాలయం -2, కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలోని సచివాలయం-1లో జరుగుతున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీసీ, ఆరోగ్య శ్రీ, కంటి వెలుగు తదితర వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి జ్వర పీడితులను గుర్తించి వారికి అవసరమైన సేవలు అందించాలన్నారు. అనంతరం ఆయా సచివాలయాల్లో రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.